

దగ్గు, జలుబుతో ట్రిపుల్ ఐటి విద్యార్థులు సతమతం

ప్రతిరోజూ వంద మంది విద్యార్థులకు చికిత్స

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటి విద్యార్థులు తీవ్రమైన దగ్గు, జలుబుతో సతమతమవుతున్నారు. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిరోజూ సుమారు వంద మందికిపైగా అనారోగ్యంతో కళాశాల ఆవరణలోని వైద్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నాలుగైదు రోజులుగా కళాశాలలో ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరం రెండు రోజులపాటు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిష్కారం ఊసే లేని.. పిజిఆర్ఎస్..!


- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని సమస్యలు
- గడువు చివరి రోజు ఏదోకటి రాసి ఫిర్యాదు ముగింపు
- భూముల సమస్యల్లో రెవెన్యూ అధికారుల తీరు మరింత దారుణం
- ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా అధికారుల జిమ్మిక్కులు
- ప్రతివారం పిజిఆర్ఎస్‌లో 300కు పైగా ఫిర్యాదుల నమోదు

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో సర్వే నెంబర్ 95/1జి1లోని 25 సెంట్ల భూమిని రీసర్వేలో రెవెన్యూ అధికారులు నోషనల్ ఖాతాలో నమోదు చేసేశారు. తన భూమికి పాస్‌బుక్ ఉందని, రీసర్వేలో తప్పుగా నమోదు చేయడంతో మ్యూటేషన్ చేయడం లేదని ఫిర్యాదుదారుడు పిజిఆర్ఎస్‌లో అనేకసార్లు ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా సమస్య పరిష్కారం కాని పరిస్థితి. గడువు పూర్తయ్యే వరకూ వేచిచూసి చివరిలో జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించడమైందని చెప్పి ముగించేస్తున్నారు. రీఓపెన్ కాకుండా క్లోజ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. పిజిఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయానికి లేఖ రాస్తే జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయానికి పంపించారు. 105 రోజులు గడువు ఇవ్వగా చివరిరోజు జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించడమైనది అని చెప్పి ముగించేశారు. సమస్య పరిష్కారం కాక రెండేళ్లుగా బాధితుడు అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది.'

'నిడమర్రు మండలం ఎనికేపల్లి గ్రామంలో ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా సిమెంట్ రోడ్డుకు గాడికొట్టి తాగునీటి పైప్‌లైన్ మీదుగా మురుగునీటి పైప్‌లైన్ వేశారని, దీనివల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని శ్రీనివాసరావు అనే వ్యక్తి పిజిఆర్ఎస్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేశాడు. తాగునీటి పైప్‌లైన్ లేని రోడ్డుకు మరోపక్కన మురుగునీటి పైప్‌లైన్ వేసుకునేందుకు అవకాశమున్నా.. అలాకాకుండా తాగునీటి పైప్‌లైన్‌పైనే వేశారు. అధికారులు తాగునీటి పైప్‌లైన్‌పై వేసిన మురుగునీటి పైప్‌ను తొలగించి వేరొక పక్కన వేయించాల్సి ఉండగా తప్పుడు నివేదికలతో రాజకీయ నాయకులకు అనుకూలంగా ఇబ్బంది లేదన్నట్లు ఫిర్యాదు ముగించేశారు. పిజిఆర్ఎస్ కార్యాలయం నుంచి ఫోన్ చేయగా ఫిర్యాదును రీఓపెన్ చేసినా ఫలితం లేకుండా పోయింది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సమస్యలే కాదు.. పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదులు ఇస్తున్న ఫిర్యాదుదారులంతా ఇదేవిధంగా బాధపడుతున్నారు. ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్‌లో 300కుపైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఒకవారం ఏదైనా కారణంతో పిజిఆర్ఎస్ నిలిచిపోతే తర్వాత వారం 400కుపైగా ఫిర్యాదులు వస్తున్న పరిస్థితి నెలకొంది. ఫిర్యాదుల పరిష్కారంపై అత్యంత శ్రద్ధ తీసుకోవాలని జిల్లాలోని అధికారులకు కలెక్టర్ ఆదేశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జనం నుంచి వస్తున్న ఫిర్యాదులను మండల, డివిజన్‌స్థాయి అధికారులు సీరియస్‌గా తీసుకోని పరిస్థితి ఉంది. ఫిర్యాదు తీవ్రతను బట్టి వారం రోజుల నుంచి 105 రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. గడువు చివరి వరకూ కాలయాపన చేసి రెండు రోజుల ముందు సమస్యను ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని, లేకపోతే స్థానిక పరిస్థితికి భిన్నంగా ఎండార్స్‌మెంట్‌లు ఇస్తూ ముగించేస్తున్నారు. ఫిర్యాదుదారులు సంతకాలు చేయకపోతే రిజిస్టర్ పోస్టు ద్వారా ఎండార్స్‌మెంట్‌లు పంపిస్తున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా భూముల సమస్యలపై రెవెన్యూ అధికారులు అత్యంత ఘోరంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడకి తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో మండలస్థాయిలో తహశీల్దార్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. సమస్య జెసి పరిధిలో చేయాల్సి ఉంటే తహశీల్దార్ జెసి కార్యాలయంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి. అలాకాకుండా ఉన్నతాధికారులకు నివేదించామని ముగించడం ఏమిటో అర్థం కావడం లేదు. కొంతమంది అధికారులు ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కాకుండా టెక్నికల్ జిమ్మిక్కులు ఉపయోగించి ముగిస్తున్నారు. మళ్లీ జిల్లా కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. దీంతో ఒకే సమస్యపై జనం పదులసార్లు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. రోడ్డుకు ఒకవైపు తాగునీటి పైప్‌లైన్ ఉన్నప్పుడు, రెండోపక్కన మురుగునీటి పైప్ వేయడం జరుగుతోంది. అలాకాకుండా తాగునీటి పైప్‌లైన్ లేనివైపు కాకుండా ఉన్నవైపు మురుగునీటి పైప్‌లైన్ వేస్తే అధికారులకు తప్పుగా అనిపించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. రాజకీయ నేతలు అండగా ఉంటే పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. పైగా ఫిర్యాదుదారులపై బెదిరింపులకు సైతం దిగుతున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు జనం క్యూ కడుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే జనం అంతదూరం ఎందుకు వెళ్లాల్సి ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్‌ఫోటో)

పిజిఆర్ఎస్ కార్యాలయం నుంచి తూతూమంత్రంగాఫోన్లు

పిజిఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదును ముగించిన తర్వాత ఫిర్యాదుదారులకు పిజిఆర్ఎస్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్న పరిస్థితి ఉంది. తన సమస్య పరిష్కారం కాలేదంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. రీఓపెన్ చేస్తామని సిబ్బంది చెబుతున్నా అతీగతీ ఉండటం లేదు. సిబ్బంది ఎందుకు ఫోన్ చేస్తున్నారో.. ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఒకే సమస్యపై ఫిర్యాదు రీఓపెన్ అయినప్పుడు అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదో తెలియడం లేదు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ఒక తంతులా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలి

అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐటిడిఎ పిఒ రాములు నాయక్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆయన ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుక్కునూరు మండలానికి చెందిన కూటమి నాయకులతో కలిసి ఐటిడిఎ పిఒ రాములునాయక్ నిర్వాసితుల నుండి పెద్దఎత్తున కమీషన్ రూపంలోని దండుకుంటున్నారని, దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పిఒపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వం కోల్పోయిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా ఉండాల్సిన పిఒ కమీషన్ ఇవ్వకపోతే మీపై క్రిమినల్ కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తానని నిర్వాసితులను బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. స్థానిక కూటమి నాయకులతో మీరు మాట్లాడుకుని సెటిల్‌మెంట్ చేయాలని పిఒ చెప్పడం చూస్తుంటే పిఒ అవినీతికి అధికార పార్టీ అండదండలు ఉన్నాయనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు. ఈ విషయంలో కూటమి పక్షాలైన టిడిపి, జనసేన, బిజెపి ఏం సమాధానం చెబుతాయని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతో పిఒ ఈ దందాకు తెరతీసినట్లు కన్పిస్తోందని విమర్శించారు. నిర్వాసితుల ప్యాకేజీ విషయంలోనూ పెద్దఎత్తున అవినీతి జరుగుతుందని, దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి కుక్కునూరు ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐటిడిఎ పిఒ రాములు నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఒ వెనుక నుండి నడిపిస్తున్న అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులపైనా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నిర్వాసితులను ఐక్యం చేసి పోరాటం చేపడతామని ఆయన హెచ్చరించారు.



మహాసభలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతు రక్షణ ఉద్యమం


ట్రంప్ సుంకాలతో మన దేశ వ్యవసాయం కుదేలు

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర కల్పించాలి

ఎపి రైతుసంఘం 23వ జిల్లా మహాసభలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతు రక్షణ కోసం ఉద్యమాలు సాగించాలని, రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రోటరీ క్లబ్ హాలులో సంఘం 23వ జిల్లా మహాసభ నిర్వహించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మహిళ రైతు నేత గంగుల రమణ వ్యవహరించారు. మహాసభ ప్రారంభ సూచికంగా సంఘం జెండాను ఆ సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు ఆవిష్కరించారు. రైతుఉద్యమ అమరవీరులకు మహాసభ జోహార్లు అర్పించింది. ముఖ్యఅతిథి వి.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్లచట్టాల స్థానంలో కొత్త చట్టాలు తీసుకొస్తూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే రైతులు దివాళా తీసి వ్యవసాయ నష్టాలతో అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ట్రంప్ సుంకాలతో మనదేశ వ్యవసాయం దివాళా తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా రంగంతోపాటు పాడి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల దిగుమతులతో దేశంలో రైతులకు కనీస ధరలు రావడం లేదన్నారు. ట్రంప్ మన వ్యవసాయ ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు విధిస్తే, మన దేశంలోకి పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాన్ని మోడీ ఎత్తివేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్పొరేటీరణకు వ్యతిరేకంగా రైతు రక్షణ కోసం సమరశీల ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను సభలో ప్రవేశపెట్టారు. జిల్లాలో గడిచిన మూడు సంవత్సరాల కాలంలో ధాన్యం, కోకో, కొబ్బరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, అపరాలు, ఆక్వా, పాడి తదితర పంటల రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు సాగించామన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల కోసం పోరాటాలు చేశామన్నారు. ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యాయని చెప్పారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.సూర్యారావు మాట్లాడుతూ కార్మిక, కర్షక ఐక్యతతో సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయరంగం పూర్తిగా నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. సభలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య, కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, నాయకులు గంటా పాపారావు, బిక్కిన వీరసత్యం, దాసరి జానకిరామిరెడ్డి, అనపర్తి వెంకటేశ్వరరావు, మాంద్రు సూర్యచంద్రం, బోడిక రామచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.మాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి.గోపీ తదితరులు పాల్గొన్నారు.



సంఘ పతాకాన్ని ఆవిష్కరించి నినదిస్తున్న నేతలు, ప్రతినిధులు

సాంకేతికతతో నేరాల సంఖ్య తగ్గింపు

ఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సాంకేతికత వినియోగంతో ఏలూరు జిల్లావ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఐజి జివిజి.అశోక్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పోలీస్ సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. నూజివీడు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన శనివారం సందర్శించారు. తొలుత ఐజి అశోక్‌కుమార్‌కు పోలీస్ సిబ్బంది, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సర్కిల్ పరిధిలోని సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో నమోదు చేసిన కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయడానికి సూచనలు చేశారు. టెక్నాలజీ వినియోగం ద్వారా ఇటీవల నూజివీడు రూరల్, పట్టణ పరిసర ప్రాంతాల్లో నమోదైన చోరీ కేసుల పరిష్కారంలో సిబ్బంది చూపిన ప్రతిభను ఆయన ప్రశంసించారు. ప్రజల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. కోర్టు మానిటరింగ్ విభాగాల కృషిని ప్రశంసించారు. ఈ ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఐజి వెంట ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ ఉండగా, కార్యక్రమంలో టౌన్ సిఐ సత్యశ్రీనివాస్, రూరల్ సిఐ కె.రామకృష్ణ, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడు స్టేషన్‌లో ఐజి, ఎస్‌పి

బస్ స్టేషన్‌లో డిపిటిఒ తనిఖీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


ముదినేపల్లి బస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షబ్నం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ ప్రాంగణమంతా దుమ్ము ధూళితో నిండిపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్ స్టేషన్ శుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా చూడాలని అన్నారు. షబ్నం వెంట ఏలూరు డిపో మేనేజర్ వాణి ఉన్నారు.

పెట్టుబడులు కూడా రావాయే..!

రైతులకు నష్టం మిగిల్చిన మొంథా తుపాన్

ముంపుతో తగ్గిన దిగుబడులు

ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



ప్రజాశక్తి - నరసాపురం, ఆచంట, కాళ్ల

మొంథా తుపాను రైతుల పాలిట శాపంగా మారింది. అప్పు చేసి భారీ పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి, కాయగూరలు, ఆక్వా పంటలు ఎడతెరిపి లేని వర్షాలకు నీట మునిగాయి. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు. తీరంలో పెద్దఎత్తున బీర, బెండ, ఆనప, దోస, వంగ వంటి పంటలు పండిస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి కురిసిన వర్షాలు తీవ్ర నష్టం చేకూర్చాయని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

దేవిరెడ్డి కొండలరావు, వేములదీవి, నరసాపురం మండలం



నేను ఎకరంన్నర పొలంలో బీర, ఆనప సాగు చేశా. విత్తనాలు, కూలీ ఖర్చులతోపాటు ఎరువులు, పురుగుమందుల ఖర్చులు కలిపి రూ.లక్ష పెట్టుబడి పెట్టా. దీనికోసం అప్పు చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, మొంథా తుపాన్‌తో పంట మొత్తం నాశనమైంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

గూడపాటి ప్రసాదరావు, వేములదీవి, నరసాపురం మండలం



నేను రెండున్నర ఎకరాల్లో రొయ్య వేశాను. రొయ్య పిల్ల, మేత, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టా. మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షానికి చెరువు గండి పడి మొత్తం నల్లి క్రీక్‌లో కలిసిపోయింది. అధికారులు పంట నష్టాన్ని గుర్తించి న్యాయం జరిగేలా చూడాలి.

పంట నష్టం తప్పలేదు

సుధాబత్తుల శ్రీనివాస్, కౌలురైతు, ఏలూరుపాడు, కాళ్ల మండలం



ఏడెకరాలు వరి సాగు చేస్తున్నాను. మొంథా తుపాను రీత్యా కురిసిన వర్షాలకు ఉప్పుటేరు నీరు వరి పొలాల్లోకి ఎగదన్నింది. పంట నీట మునిగింది. సాగు ఖర్చు ఎకరానికి రూ.25 వేలు అయ్యాయి. విత్తనాలు, ఎరువుల భారం పెరిగింది. పొట్ట దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. ఎకరాకు ఏడెనిమిది బస్తాల దిగుబడి తగ్గుతోంది. ఈసారి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. వర్షానికి దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

కూరగాయ రైతులను ఆదుకోవాలి

ముత్యాల నారాయణరావు, కౌలురైతు, పెదమల్లం, ఆచంట మండలం



రెండెకరాల పొలాన్ని నలుగురు కలిసి రూ.లక్షకే కౌలుకు తీసుకున్నాం. మూడు లక్షలు పెట్టుబడి పెట్టాం. వాతావరణం అనుకూలించకపోవడంతో వంగ మొక్కలకు చీడపీడలు ఆశించాయి. సాగు చేపట్టి మూడు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు దిగుబడి రాలేదు. వంగకు ధర ఉన్నా దిగుబడి లేదు. వాతావరణ మార్పులు పెనుశాపంగా మారాయి. కాయగూరల సాగు కష్టాల సాగుగా మారింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కౌలురైతులను ఆదుకోవాలి

ఆచంట నాగేశ్వరరావు, కౌలు రైతు, ఆచంట



తుపాన్ ప్రభావంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటి పాలైంది. రెండెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. చివరకు తుపాన్ కారణంగా నష్టం మిగిలింది. కౌలుకు 30 బస్తాలు ఇవ్వాల్సి ఉంది. పెట్టుబడులు రాని పరిస్థితి. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

పెట్టుబడులు ఎక్కువ.. ధర తక్కువ

కడలి కుమార్‌స్వామి, కౌలురైతు, కోడేరు ఉత్తరపాలెం, ఆచంట మండలం



ఎన్నో వ్యయప్రయాసాలు పడి దొండ సాగు చేస్తున్నాను. సరైన ధర లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తుపాన్ ప్రభావంతో నీటి పాలైంది. చివరకు అప్పులు మిగిలాయి. ఎకరంన్నర పొలాన్ని రూ.60 వేలకు కౌలుకు తీసుకుని దొండ పాదులు సాగు చేశాను. దొండ పాదులకు పందిరి వేయడానికి రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. ఎరువులు పురుగు మందుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ పంటకు మాత్రం మద్దతు ధర రావడం లేదు. దొండ ధర ఆశాజనకంగా ఉన్న తరుణంలో తుపాన్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో దిగుబడులపై ప్రభావం పడింది. చివరికి అప్పుల పాలయ్యాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కనీసం పెట్టుబడులు రాలేదు

కుసుమే నాగేశ్వరరావు, కౌలురైతు కొడమంచిలి టి.మెరక, ఆచంట మండలం



అరెకరం పొలం కౌలుకు తీసుకుని బెండ సాగు చేశాను. వారం రోజులు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పంట నీట మునిగి కుళ్లిపోయింది. రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. కమీషన్ వ్యాపారులు పంట చేతికొచ్చే సమయంలో అయినకాడికి కొని రైతులకు మొండిచెయ్యి చూపుతున్నారు. తెగుళ్లు సోకి మొక్కలు, ఆకులు చిన్నగా మారి పాలిపోతునట్లుగా ఉంటున్నాయి. దీంతో మొక్కల ఎదుగుదల ఆగిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వమే కూరగాయ రైతులను ఆదుకోవాలి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత

ప్రజాశక్తి - చింతలపూడి




ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత అన్నారు. చింతలపూడి సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఆర్‌టిఒ ఇచ్చిన నెంబర్ ప్లేట్లు ఉండాలని అన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలని, సీటు బెల్ట్ కచ్చితంగా పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని వివరించారు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు ఆటకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చింతలపూడి సిఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో ధాన్యం సేకరణకు చర్యలు

ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ

ప్రజాశక్తి - కలిదిండి

కోరుకొల్లులో రైతుభరోసా కేంద్రం ద్వారా ధాన్యం సేకరించేలా చర్యలు చేపడతామని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని కోరుకొల్లు సొసైటీ కార్యాలయంలో రైతులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలో 1700 ఎకరాల్లో వరి సాగవుతుండగా, దానిలో 40 శాతం కోరుకొల్లులోనే సాగవుతుందన్నారు. కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం ఏర్పాటు చేసి, ధాన్యం సేకరణ చేయకుంటే ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ఎంఎల్‌సికి తెలిపారు. అధికారుల అవగాహనారాహిత్యం వల్ల ఒక్క ఎకరం వరి కూడా పండని భాస్కరరావుపేటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, కోరుకొల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంఎల్‌సి వెంకటరమణ జెసికి ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం ఎంఎల్‌సి మాట్లాడుతూ సంబంధిత మంత్రిని కలిసి మాట్లాడతానని రైతులకు హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ

ఆశ్రం మెడికల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ పరీక్ష ఫలితాల్లో ఆశ్రం మెడికల్ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ ప్రదర్శించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో ఆశ్రం విద్యార్థిని సి.దేవికి యూనివర్శిటీ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనాటమీ విభాగం నుంచి ఎస్.కార్తికేయ ఏడో ర్యాంక్, సి.దేవికి 9వ ర్యాంక్, ఫిజియాలజీ విభాగం నుంచి దేవికి ఐదో ర్యాంక్, ఎం.లీషామాన 8వ ర్యాంక్, బి.అశ్వితరెడ్డి పదో ర్యాంక్, బయో కెమిస్ట్రీ విభాగం నుంచి కె.గీతాశివలక్ష్మి ఆరో ర్యాంక్, జి.కౌసల్య 9వ ర్యాంక్, కె.స్నేహ తొమ్మిదో ర్యాంక్, సి.దేవికి పదో ర్యాంక్, శ్రీ చైతన్య పదో ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల కృషి ఈ ఫలితాలకు నిదర్శనమన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆశ్రం ఛైర్మన్ గోకరాజు గంగరాజు, డైరెక్టర్ రవితేజ, ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ అంజిరెడ్డి అభినందించారు.

11న ఆగిరిపల్లిలో మెగా జాబ్‌మేళా

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 11వ తేదీన ఆగిరిపల్లిలో మెగా జాబ్‌మేళా నిర్వహించి 1135 మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 1135 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 17 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎస్‌ఎస్‌సి నుంచి ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.ఫార్మసీ, బి.టెక్, తదితర కోర్సులు పూర్తిచేసిన వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశం పొందవచ్చన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 8374039719, 9491694228ను (9988853335 టోల్ ఫ్రీ) నెంబర్లను సంప్రదించవచ్చని, నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పార్థసారథి విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శనివారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నిక తాలూకా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కోశాధికారి డి.వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులుగా నిర్వహించగా అసోసియేషన్ అధ్యక్షులుగా బియ్యం సింగ్, కార్యదర్శిగా వి.స్వర్ణ ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా పిపి.రంగారావు, కెజెడి రీకర్డ్, ఉపాధ్యక్షులుగా బి.శేషయ్య, సత్యప్రసాద్, మధుసూదనరావు, ఏసుపాదం, పలువురు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

తాగునీరు కలుషితం

ప్రజాశక్తి - ముదినేపల్లి

బొమ్మినంపాడు గ్రామంలోని మంచినీటి చెరువు గుర్రపుడెక్క, నాచుతో పూర్తిగా నిండి మంచినీరు కలుషితం అయిపోయాయని గ్రామస్తులు ఎంపిటిసి జయమంగళ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జయమంగళ వెంకటరమణ వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి గుర్రపు డెక్క తొలగించేందుకు తీయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంపుల నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి మండలంలోని లక్ష్మీపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేస్తుండగా కొవ్వూరు ఇసుక ర్యాంపు నుంచి రెండు లారీల్లో ఇసుకను లోడ్ చేసుకొని తాడువాయి వ్యక్తి పేరు మీద బిల్లు తీసుకుని, తెలంగాణ రాష్ట్రానికి వెళ్తుండగా మార్గ మధ్యలో ఆపి తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకపోవడంతో రెండు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు లారీలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కుక్కునూరు :మండల పరిధిలోని కిన్నెరసాని నది నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి ఇసుకతో నిండిన ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని గోదావరి నదిలో శుక్రవారం గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం గొమ్ముగూడెం గ్రామం వద్ద లభ్యమైంది. మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన కుమ్మరపల్లి నాగార్జున (25) తోటి అయ్యప్పస్వామి మాలధారులతో కలిసి దాచారం గోదావరి రేవులో శుక్రవారం స్నానానికి దిగి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి నది పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బృందాల సహాయంతో మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులకు వ్యక్తి మృతదేహాన్ని అప్పగించి కేసు నమోదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని సాయిబాబా ఆలయంలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు అనారోగ్య కారణాలతో రక్తపు వాంతుల కారణంగా మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నగరంలోని ఫెల్‌హౌస్‌పేటకు చెందిన డొల్ల లక్ష్మణరావు (65) స్థానికంగా కూలీ పనులు చేస్తూ భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కలిసి జీవిస్తున్నాడు. మొదటి భార్య చనిపోగా ప్రస్తుతం రెండో భార్యతో అతను కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని సాయిబాబా ఆలయంలో రాత్రివేళ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆలయంలో శనివారం ఉదయం అతను శరీరమంతా రక్తంతో నిండి మృతి చెందిపడి ఉన్నాడు. అతన్ని ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే తెల్లవారుజామున సీసీ కెమెరాలు రికార్డు అయినా వీడియో ఫుటేజ్ ఆధారంగా అతను అనారోగ్య కారణాల వల్ల రక్తపు వాంతులు చేసుకుని అక్కడే సొమసల్లి పడిపోయాడని, ఎవరూ గమనించకపోవడంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం అనంతరం తెలియనున్నాయని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

తన భర్త తనను, తన తల్లిని దుర్భాషలాడుతూ పలు ఇబ్బందులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. మండలంలోని కాట్రేనిపాడు పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రత్తిపాటి ఐశ్వర్య, తన తల్లి చాట్ల సరోజిని నూజివీడులో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల సరోజిని ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆమె కుమార్తె ఐశ్వర్య, అల్లుడు షారోనురాజు కలిసి పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే గత నెల 25వ తేదీన ఆటో ఫైనాన్స్ చెల్లించాలనే ఉద్దేశంతో షారోనురాజు ఏలూరుకు వెళ్లగా మధ్యాహ్నం సమయంలో సరోజిని ఫోన్‌లో మాట్లాడగా ఆయన మద్యం తాగి దుర్భషలాడాడు. ఈ విషయమై సరోజిని మందలించగా అదే రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన షారోనురాజు తీవ్ర పదజాలంతో దుర్భాషలాడి, చంపుతానంటూ బెదిరించాడని ఐశ్వర్య ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు, తన తల్లి సరోజినికి భద్రత కల్పించి, తన భర్త షారోనురాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

పోలవరం తహాశీల్దార్ బి.సాయిరాజు

చిట్ చాట్



ప్రజాశక్తి - పోలవరం

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రాధాన్యత అని పోలవరం తహాశీల్దార్ బి.సాయిరాజు చెప్పారు. మండలంలో అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిర్వాసితుల సమస్యలు, భూమి వివాదాల పరిష్కారం వంటి అంశాలపై తహాశీల్దార్ బి.సాయిరాజు ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : మండలంలో ప్రధాన సమస్యలు ఏంటి?

తహాశీల్దార్ : ప్రధానంగా పోలవరం నిర్వాసితుల్లో 18 ఏళ్లు నిండినవారు ఎస్ఇఎస్ డేటాలో రాని తదుపరి 18 ఏళ్లు నిండిన వారికి ఎస్ఇఎస్ సర్వేకు ముందుగా వివాహమైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోరాడం, ఆర్అండ్ఆర్ కాలనీ కొంద్రుకోట, వెంకటరెడ్డిగూడెంలో శ్మశానం ఏర్పాటు.

ప్రశ్న : ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేందుకు మీరు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

తహాశీల్దార్ : పథకాలను బట్టి లబ్ధిదారులకు సకాలంలో కుల ధ్రువ పత్రాలు మంజూరు చేయడం, మిగిలిన శాఖలతో సమన్వయం చేసి అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు చేరేలా చూస్తాం.

ప్రశ్న : రేషన్, పింఛన్లు, హౌసింగ్ వంటి పథకాల పంపిణీలో ఏవైనా కొత్త మార్పులు చేశారా?

తహాశీల్దార్ : పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు అర్హులైన వారందరికీ సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాం. హౌసింగ్‌కు సంబంధించి మార్గదర్శకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

ప్రశ్న : ప్రజల ఫిర్యాదులను, అభ్యర్థనలను పరిష్కరించడంలో మీ ప్రాధాన్యత ఏమిటి?

తహాశీల్దార్ : పేదలు, నిరక్షరాస్యుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో నిర్ణీత గడువులో పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న : భూ వివాదాలు తగ్గించడానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

తహాశీల్దార్ : క్షేత్ర పరిశీలన చేసి ఇరు గ్రూపులకు రెవెన్యూ కోర్టు నిర్వహించి హక్కు పత్రాలను బట్టి చట్ట నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం.

ప్రశ్న : గ్రామీణాభివృద్ధికి మీరు తీసుకుంటున్న ప్రత్యేకత చర్యలు ఏవైనా ఉన్నాయా?

తహాశీల్దార్ : కొత్త ప్రభుత్వంలో జిల్లా అధికారుల సూచనల మేరకు గ్రామీణాభివృద్ధికి మండల స్థాయి అధికారులు గ్రామాలను దత్తత తీసుకుంటున్నారు. నేను గడ్డపల్లి గ్రామ పంచాయతీని దత్తత తీసుకున్నాను.

ప్రశ్న : యువత ప్రభుత్వ సేవల్లో చేరాలనుకుంటే వారికి మీ సలహా ఏమిటి?

తహాశీల్దార్ : బాధ్యతాయుతంగా జవాబుదారీతనంతో ప్రజా సేవ చేయాలని సంకల్పం ఉన్న యువతకు ప్రభుత్వ ఉద్యోగం మంచి అవకాశం.

చెప్పేదొకటి.. చేసేదొకటి..!

వరుస బస్సు ప్రమాదాలతో రెండు జిల్లాల్లో రోడ్ల పరిస్థితి మరోసారి తెరపైకొచ్చింది. ఇక నేవీ ఆయుధ డిపో ఏజెన్సీలోని గిరిజనుల నివాస ప్రాంతాల నడుమ, పచ్చని పంట పొలాల్లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష నేతల పర్యటన విజయవంతం కావడం అక్కడి ప్రజలు ఆ డిపోను ఏస్థాయిలో వ్యతిరేకిస్తున్నారనేది ప్రస్ఫుటమైంది. జిల్లాల పునర్విభజనపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మాటలు కోటలు దాటుతున్నా.. కాలు గడప దాటడం లేదనే చందంగా రోడ్ల అభివృద్ధిపై పాలకుల చేతలున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో ప్రధాన రోడ్లన్నీ జాతీయ రహదారులతో సహా అధ్వానంగా తయారయ్యాయి. మొంథా తుపాన్ ప్రభావం, అంతకుముందు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. వైసిపి ప్రభుత్వం తన పదవీ కాలం ముగిసే సమయంలో కొన్ని రోడ్లు నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్రాంతిలోగా రోడ్లపై గుంతలు పూడ్చుతామని, ఆపై రోడ్లన్నింటినీ అభివృద్ధి చేస్తామని గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో సంక్రాంతికి కొన్ని ముఖ్యమైన రోడ్లకు మరమ్మతులు చేశారు. అయితే ఆ మరమ్మతుల తీరు సైతం గోతులు పోయి.. గొప్పులు వచ్చాయనే వ్యాఖ్యానాలు సైతం విన్పించాయి. మిగిలిన రోడ్లపై స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ఎంఎల్‌ఎలు, ఎంపీలు, మంత్రులు అనేక ప్రకటనలు చేసినా వాటికి కనీసం మరమ్మతులు చేసిన నాథుడే కరువయ్యాడు. పైగా వర్షాకాలం ప్రారంభంలో రోడ్ల పక్కన మార్జిన్లలో చేపట్టాల్సిన జంగిల్ క్లియరెన్స్ నిర్వహించకపోవడం, మార్జిన్లలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోయి పరిస్థితి మరింత దిగజారింది. కొన్ని రోడ్లపై గోతులు తప్ప రోడ్లు కన్పించని పరిస్థితి ఉండగా, మరికొన్ని రోడ్లలో భారీ గోతులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్త్రీశక్తి పథకం కారణంగా ఆర్‌టిసి బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే తెలంగాణాలోని చేవెళ్ల ఘటన పునరావృతమయ్యే పరిస్థితి ఉందని జనం ఆందోళనకు గురవుతున్నారు. లింగపాలెం ఘటనతో రవాణా శాఖ డొల్లతనం బయటపడింది. ప్రభుత్వ విధానాల ఫలితంగా పర్మిట్లు, లైసెన్స్‌లు మంజూరు చేయడం మినహా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించే పరిస్థితి తగ్గిపోయింది. నిర్వహించినా భారీ లోడులను అడ్డుకోలేకపోవడం, అవినీతి



ఇతర కారణాల రీత్యా ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఉండి మండలంలో జరిగిన స్కూల్ బస్సు ప్రమాద ఘటన, లింగపాలెం మండలంలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటన రెండింటిలోనూ డ్రైవర్లు మద్యం తాగి ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని సందర్భాల్లోనైనా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలల్లోనూ బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహించాలని, డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో అత్యంత సమస్యాత్మకంగా మారిన రోడ్లను అభివృద్ధి చేయాలని జనం కోరుతున్నారు.

ఇక జీలుగుమిల్లి మండలంలో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో పెట్టేందుకు ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఏజెన్సీలోని చట్టాలను సైతం తుంగలోకి తొక్కుతోంది. పైగా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, ఆ పార్టీల ప్రజాప్రతినిధులు సైతం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడే ఆయుధ డిపో పెట్టి తీరాలనడం వారు ప్రజాభిప్రాయానికి ఏమాత్రం విలువనీయరని మరోసారి తేటతెల్లమైంది. ఈ క్రమంలో వామపక్ష రాష్ట్ర నేతలు ఆయా గ్రామాల్లో పర్యటించగా అక్కడి ప్రజలు నేతలకు ఘన స్వాగతం పలుకడం ద్వారా అక్కడి ప్రజలు డిపోను ఏస్థాయిలో వ్యతిరేకిస్తున్నారో స్పష్టమైంది. పైగా పోలవరం నిర్వాసితులను ఐటిడిఎ పిఒ నేరుగా బెదిరించారనే ఆరోపణలు వెల్లువెత్తడం, పరిహారం సొమ్ములో కమీషన్ కచ్చితంగా ఇవ్వాల్సిందేనని, అది ఎంతివ్వాలనేది అక్కడి కూటమి నేతలతో మాట్లాడుకుని ఫైనల్ చేసుకోవాలని పిఒ నిర్వాసితులను బెదిరించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో తమ భూములిస్తే తమ పరిస్థితి ఇంతేగా అని ఆయా గ్రామాల నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే అటవీ భూములున్నాయని, అక్కడే డిపో పెట్టుకోవాలని గిరిజనులు సూచిస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల కమీషన్ల కోసమే ఈ డిపో విషయంలో మొండిగా ముందుకు సాగుతున్నారనేది తెలుస్తోంది. ఇదే నిజమైతే త్వరలోనే కూటమికి గిరిజనులు గుణపాఠం చెబుతారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

జిల్లాల పునర్విభజనలో లోపాలను సరి చేసే పేరిట కొత్త సమస్యలు తీసుకొస్తున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపడంపై ఎటువంటి భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం లేదు. అయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు పోలవరం జిల్లాను ఏర్పాటు ప్రతిపాదనలు లేకపోవడంపై గిరిజనులు, నిర్వాసితులు పెదవి విరుస్తున్నారు. ఒక నియోజకవర్గం అంతా ఒక జిల్లా లేదా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే పేరుతో గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపే ప్రయత్నాన్ని ఆ మండల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అదే జరిగితే గోపాలపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని తూర్పుగోదావరిలో కలిపేస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా మంత్రివర్గ సమావేశం అనంతరం గెజిట్ వచ్చే వరకూ ఈ చర్చ ఎక్కువ సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రభుత్వం కూడా కొత్త సమస్యలు సృష్టించకుండా ఉన్న సమస్యలు పరిష్కరించేలా విభజన చేపట్టాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో చెప్పేదొకటి.. చేసేదొకటి రీతిన కూటమి ప్రభుత్వం అభాసుపాలయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

సంకర్షణపురంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా సంకర్షణపురంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని సంకర్షణపురం గ్రామ సర్పంచి సంకుల వెంకట నాగరాజు శనివారం తెలిపారు. గ్రామంలో గత రెండు రోజులుగా దోమల నిర్మూలన కార్యక్రమం, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. దీపావళికి ముందు, ఆ తరువాత కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిందన్నారు. దీంతో గ్రామస్తులకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో వీధుల వెంబడి నిల్వ ఉన్న వరద నీటిని బయటకు మళ్లించామన్నారు. మురుగు కాలువల్లో నీరు లేకుండా చేసి బ్లీచింగ్ చల్లే పనులు జరిగాయన్నారు. అదేవిధంగా గ్రామంలోని పలు కాలనీల్లో, ఎస్‌సి ఏరియాలో ప్రతి వీధిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి డ్రయినేజీల్లో పూడికతీతతో పాటు బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు గ్రామమంతా ఫాగింగ్ మిషన్‌తో పిచికారీ చేశామన్నారు. గ్రామంలోని వీధుల వెంబడి, నివాస ప్రాంతాల్లో ఎలాంటి దుర్గంధం లేకుండా పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే మంచినీటి చెరువులో క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని గ్రామస్తులకు సరఫరా చేస్తున్నట్లు సర్పంచి సంకుల వెంకట నాగరాజు తెలిపారు. ఈ పనులను సర్పంచితో పాటు సంకర్షణపురం గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి ఎస్.హారిక పరివేక్షించారు.



పిచికారీ చేస్తున్న సిబ్బంది

వికలాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కూటమి సంకీర్ణ ప్రభుత్వం వికలాంగుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు వారికి ఉచితంగా మూడు చక్రాల మోటారు వాహనాలను అందించాలని నిర్ణయించిందని, దీనికి సంబంధించిన వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని టిడిపి మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్ సూచించారు. గతంలో వాహనాల కోసం దరఖాస్తు చేసిన వారు కూడా తమ ఇళ్ల నుంచే మళ్లీ ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామ కమిటీ ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టి, అర్హులైన వికలాంగులెవరూ మిస్ కాకుండా చూడాలని ఆయన కోరారు.

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపేందుకు ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపేందుకు మంత్రివర్గం ఆమోదించటంతో పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నూజివీడు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో శ్రీ శారదా విద్యాసంస్థల అధినేత కె.శంకరరావు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని థాంక్యూ సిఎం సార్ అంటూ నినాదాలు చేశారు. సిఎం చంద్రబాబు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిటిజన్ ఫోరం సభ్యులు, విద్యార్థులు, శారదా విద్యాసంస్థల అధినేత శంకరరావు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుదలపై శిక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.మణికుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 11, 12 తేదీల్లో మండలంలోని పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుదలపై నిర్వహించే శిక్షణాకార్యక్రమానికి సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని ఆమె కోరారు.

మాక్ అసెంబ్లీకి రమణక్కపేట విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు



మాక్ అసెంబ్లీకి రమణక్కపేట విద్యార్థులు ఎంపికయ్యారు. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయనున్న మాక్ అసెంబ్లీకి మండలంలోని రమణక్కపేట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందని ఇద్దరు విద్యార్థులు ఉప్పే దివ్యశ్రీ, ఉప్పే అనిత ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ తెలిపారు. ఇటీవల నియోజకవర్గస్థాయిలో భారత రాజ్యాంగం పట్ల వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించగా ఇద్దరు విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొంది ఎంపికయ్యారని చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు మాక్ అసెంబ్లీకి ఎంపిక కావటం చాలా సంతోషకరమైన విషయమని విద్యార్థులను పాఠశాల కమిటీ ఛైర్మన్ రాజా, ఉపాధ్యాయులు, మండల నాయకులు అభినందించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు

12న వ్యతిరేక నిరసన ర్యాలీలు : వైసిపి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏలూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ పోస్టర్లను వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ప్రజల అభ్యున్నతికన్నా ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. జగన్ నేతృత్వంలో గత ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవడానికి ఈ నెల 12వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జరగబోయే ఈ నిరసన ర్యాలీల్లో వైసిపి శ్రేణులతో పాటు ప్రతిఒక్కరూ పాల్గొని ప్రజా ఉద్యమానికి బలాన్నివ్వాలని దూలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి కెబిఎం.రాజు లేఖ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరీకి డీలర్ల సమస్యలపై మూడు ప్రధానాంశాలను లిఖిత పూర్వకంగా పంపినట్లు ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కెబిఎం.రాజు తెలిపారు. నూజివీడు పట్టణంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెట్రోల్‌లో ఇథియం మిక్సింగ్ వల్ల డీలర్లకు తలవసంపులు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. డీలర్లు స్వాతహాగా పెట్రోల్‌లో నీరు కలపరని, ప్రకృతి వైపరీత్యం వల్ల వర్షం నీరు ట్యాంకుల్లో చేరి ఇథనాల్ నీరుగా మారుతుందని చెప్పారు. నెలవారీ టార్గెట్‌ను కంపెనీలు నిర్దేశించి డీలర్లను మనోవేదనకు గురి చేస్తున్నాయన్నారు. డీలర్ల అవసరాలు, వినియోగదారుల వినియోగం, ఆధారంగా లోడులు పంపాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో 70 వేల పెట్రోల్ బంకులు ఉండగా గతేడాదిలో ఏకంగా 70 వేల కొత్త బంకులు ఇచ్చారని, దీనికి ప్రాతిపదిక ఏమిటని మంత్రిని ప్రశ్నించారు. వర్షాలవల్ల పెట్రోల్‌లోని ఇథనాల్ నీరుగా మారిన సందర్భంలో కంపెనీలు నష్టపరిహారం చెల్లించాలని మంత్రిని అభ్యర్థించినట్లు వివరించారు.

10 నుంచి రైల్వేగేటు మూసివేత

ఏలూరు : వట్లూరు-ఏలూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నెంబర్ 347 (486/26-28) కిలోమీటర్ల వద్ద అత్యవసర మరమ్మతులు పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల పదో తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల ఏలూరు-వట్లూరు స్టేషన్ల మధ్యలో ఏలూరులోని వన్, టూ టౌన్ వరకు ఉన్న రైల్వే గేట్లను మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని ఆయన కోరారు.

CHANGE OF NAME

I, PADAVALA VIJAYA LAKSHMI, W/o Padavala Jagan Mohan Rao, D.No. 3-169, Kothota, Mutyalapalli Post, Mogaltur (M), W.G.Dt. A.P. I have changed my name from **PADAVALA VIJAYA LAXMI** (Old name) to **PADAVALA VIJAYA LAKSHMI** (New name) hence forth I am being called **PADAVALA VIJAYA LAKSHMI** W/o Padavala Jagan Mohan Rao, for all purposes.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL SC/ST COURT AT KHAMMAM
M.A.T.O.P.No.495 OF 2024

BETWEEN:
1) Billa Revathi Devi and others ...Claim Petitioners
AND
1) Digumathi Subba Rao and others ..... Respondents

R1) Digumathi Subba Rao, S/o Ganga Raju, Age:45 Years, Occ: Driver of Ashok Leyland Lorry bearing no.AP 05 TF 1155, R/o H.No.15-7-19, Meraka Veedhi, Kovvur, West Godavari District, Andhra Pradesh State, is the Respondent No.1 herein.

Take notice that the claim petitioner filed the above case against you for grant of Compensation an account of Death of husband of claim petitioner no.1 in motor accident before the Hon'ble Motor Accidents Claims Tribunal (SC/ST): At Khammam, Telangana State. That the above case posted for your appearance on **Dt: 25/11/2025 at 10:30 AM,** As such you may appear personally or through your counsel without fail, otherwise the Hon'ble court will pass appropriate orders in your absense.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- Immadi laxminarayana,MSC,LLB
Immadi Anvesh,B.Com. (BL)
Advocates
KHAMMAM-507 002.
Telangana State, Cell: 9866934210

CHANGE OF NAME

I. **NAREDLA ROJA RATNA SHARMILA**, W/o.Madda Abhishek raju, D.No.1-142, Peddapeta, Mahadevapatnam Village, Undi Mandalam, West Godavari District, Andhra pradesh - 534199. I have Changed my name **MADDA ROJA RATNA SHARMILA**, W/o.Madda Abhishekraju (Old Name) To **NAREDLA ROJA RATNA SHARMILA**, W/o.Madda Abhishekraju (New Name) Hence Forth Iam being Called **NAREDLA ROJA RATNA SHARMILA**, W/o.Madda Abhishek Raju for all purposes.

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
క్రెడిటర్ I.P.No.12/2025

బిట్వీన్ :
పిటిషనర్ :
నంబూరి శ్రీ గంగ పవన్, S/o.సత్యనారాయణ, డోర్‌నెం.16-6-5, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
రెస్పాండెంట్లు :
1.గుంటూరి పెద్దిరాజు, S/o.వెంకట రామరాజు, డోర్‌నెం.2-115, కొమ్ముచిక్కాల గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
2.నడపన భరత్, S/o.జగపతి, డోర్‌నెం.10-42/a, రామాలయం వీధి, కొత్తపేట, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.
3.The Official Receiver, Eluru, W.G.Dist.

పై నెంబరు గ్రంథంలో పిటిషనరుకు 1వ రెస్పాండెంట్స్ ప్రోనోటు బకాయి ఉన్నందున ఆ బకాయి చెల్లించకుడానే 1వ రెస్పాండెంట్, 2వ రెస్పాండెంట్‌తో కుమ్మకై అతని పేరున ది.06-12-2024వ తేదీన దస్తావేజు నెం.14310/2024 నామ మాత్రంగా సృష్టించియున్నారు. ఆ దస్తావేజును రద్దుపరచి, అలాగే 2వ రెస్పాండెంట్‌ను ఇన్ సాల్వెంట్‌గా ప్రకటించమని కోర్టులో పిటిషనర్ పిటిషను దాఖలు చేసినందున యీ విషయాన్ని ఈ ప్రకటన ద్వారా తెలియచేస్తున్నాము.

వాయిదా : 13-11-2025

డి.సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 98491 73674

పేరు మార్పు

మహారాజశ్రీ ఏలూరు(అర్బన్) మండల తాసిల్దార్ గారికి దివ్య సముఖమునకు ఏలూరు జిల్లా ఏలూరు నగరం, గొల్లయిగూడెం, మూడో రోడ్డు షేక్ మహబూబ్ జర్నలిస్ట్ కాలనీ నివాసి, డోర్ నెంబర్ - షేక్ సాయి బాబా గారి కుమార్తె షేక్ మహబూబ్ (మహమ్మద్ అక్బర్ భర్త మహమ్మద్ అజీమ్ హుస్సేన్) వ్రాసి దాఖలు చేసుకునే అర్జీ విన్నపము:-

అమ్మ : నా పేరు పదవ తరగతి & ఇంటర్మీడియట్ నందు, ఓటు కార్డు నందు, షేక్ మహబూబ్ d% షేక్ సాయి బాబా గా ఉన్నది. కాని మ్యారేజ్ అయిన పిదప నాకు ఆధార్ కార్డు మహమ్మద్ అక్బరీగా తీసుకోవడం జరిగింది. కానీ ఉద్యోగానికి గాని, తదితర వాటికి కూడా సర్టిఫికెట్ లో పేరు ఆధార్ పేరు వేరువేరుగా ఉన్నందున, నేను ఉద్యోగం కోసం పెట్టిన దరఖాస్తుని రిజెక్ట్ అవుతున్నాయి. కారణం ఏంటని వాకప్ చేయగా విజయవాడ గవర్నమెంట్ ప్రెస్ వారు అప్లికేషన్ ఫామ్స్ ఇచ్చి మీ ఊరు తహసిల్దార్ గారి చేత సంతకాలు స్టాంపులు వేయించి, పోలీసు వారి చేత కేసులు ఏమీలేవని డిడి నోటరీ అప్లికేషన్ ఫామ్స్ పూర్తి చేసుకుని, తీసుకువచ్చిన యెడల చెప్పారు. నా పేరు మార్పు కొరకు వారు ఇచ్చిన దరఖాస్తులు పూర్తి చేసి తీసుకువచ్చిన యెడల, పేరు మార్పుకు ఆర్డర్స్ ఇస్తామని తెలిపియున్నారు. కావున ఏలిన వారు నా యందు దయ ఉంచి, నేను ఇచ్చిన దరఖాస్తు పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుకుంటున్నాను. ఈ దరఖాస్తు తో పాటు నా యొక్క టెన్త్ క్లాస్ ఇంటర్నెట్స్ సర్టిఫికెట్ జిరాక్స్, ఓటర్ కార్డు జిరాక్స్, క్యాస్ట్ సర్టిఫికెట్ జిరాక్స్, నా యొక్క ఆధార్ కార్డు నోటరీ అఫిడవిట్ తమ పరిశీలన నిమిత్తము జతపరుస్తున్నాము.

ఇట్లు: తమ విధేయురాలు
షేక్ మహబూబ్